సాక్షి నిజామాబాద్

శుక్రవారం । 27 । అక్టోబర్ । 2023



నాడు కాంగ్రెస్.. నేడు బీఆర్‌ఎస్

కాంగ్రెస్, టీడీపీలకు ఒకప్పుడు కంచుకోటగా ఉన్న జుక్కల్ నియోజకవర్గంలో తెలంగాణ ఏర్పాటు తరువాత బీఆర్‌ఎస్ పాగా వేసింది.

- 10లో ▸



టీయూలో సన్నాహక సమావేశం

టీయూ క్యాంపస్‌లో నిర్వహించిన న్యాక్ సన్నాహక సమావేశంలో సిబ్బందికి రిజిస్ట్రార్ యాదగిరి దిశానిర్దేశం చేశారు.

- 10లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
32.5 /18.7

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉదయం మంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. సాయంత్రం నుంచి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

3న సీఎం కేసీఆర్ సభ



ఆర్మూర్: పట్టణంలో నవంబర్ 3న నిర్వహించనున్న ఎన్నికల ప్రచారసభకు ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరవుతారని పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి తెలిపారు. పట్టణ శివారులోని ఆలూర్ రోడ్డులో ఉన్న విశాలమైన స్థలంలో సభ నిర్వహించనున్నామని తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

మరో అవకాశం

- ఈనెల 31 వరకు కొత్త ఓటర్ల నమోదు

సుభాష్‌నగర్: అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలని ఎన్నికల సంఘం భావిస్తున్నది. ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో ఓటరు నమోదుకు మరోసారి అవకాశం కల్పించింది. జాబితాలో పేరు లేకపోతే నమోదు చేసుకునేందుకు ఈనెల 31 వరకు గడువు విధించింది. ఈ ఏడాది అక్టోబరు 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఆన్‌లైన్‌లో లేదా బీఎల్‌వో వద్ద ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. పోలింగ్ శాతాన్ని పెంచేందుకు కృషి చేస్తున్న అధికారులు.. పోలింగ్ కేంద్రాల వారీగా ప్రత్యేక నమోదు చేపట్టారు.

మద్యం, గంజాయిని అరికట్టాలి

- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథం



ఖలీల్‌వాడి: ఎన్నికల నేపథ్యంలో మద్యం, గంజాయి, దేశీదారుని అరికట్టాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథం అన్నారు. నగరశివారులోని ఓ హోటల్‌లో మహారాష్ట్ర, కామారెడ్డి, నిర్మల్ జిల్లాలకు చెందిన ఎక్సైజ్ అధికారులతో గురువారం సమన్వయ సమావేశం నిర్వహించారు. మహారాష్ట్ర నుంచి దేశీదారు, గంజాయి, మద్యం రాకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదిలాబాద్, కామారెడ్డి, నిర్మల్ జిల్లాల నుంచి మద్యం రాకుండా చెక్ పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం డిప్యూటీ కమిషనర్ సూచించారు. గోదావరి నది పరీవాహక ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు నరసింహారెడ్డి, కిషన్, ఆదిలాబాద్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, నాందెడ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ అతుల్ కన్నాడే, ఎక్సైజ్ సూపరింటెండెంట్లు మల్లారెడ్డి, రవీందర్‌రాజు, హిమశ్రీ తోపాటు ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వోలు, ఎస్సైలు పాల్గొన్నారు.

నేడు సేంద్రియ ఉత్పత్తుల మేళా

నిజామాబాద్ సిటీ: సాయి వెజిటేబుల్, ఫ్రూట్ గ్రోవర్స్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో సేంద్రియ ఉత్పత్తుల మేళాను శుక్రవారం నిర్వహించనున్నట్లు సొసైటీ చైర్మన్ కొండెల సాయిరెడ్డి, కార్యదర్శి మమ్మాయి రాజన్న గురువారం తెలిపారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, నాబార్డు అధికారులు, సేంద్రియ రైతులు హాజరవుతారన్నారు. సేంద్రియ ఉత్పత్తులను వినియోగదారులు కొనుగోలు చేయాలన్నారు.

మాటల యుద్ధం

- కవిత ఎంత ప్రచారం చేస్తే బీజేపీకి అంత ప్రయోజనం : అర్వింద్
- అర్వింద్‌ను బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఓడిస్తారు: కవిత
- ఎంపీ . ఎమ్మెల్సీ మధ్య వాగ్బాణాలు
- ప్రచారం స్పీడందుకుంటున్న తరుణంలో విమర్శల దాడి
- అధికారంలోకి వస్తే 'జీవన్ మాల్‌ను రద్దు చేయిస్తా : రాకేశ్‌రెడ్డి

ఎన్నికల నేపథ్యంలో ఎమ్మెల్సీ కవిత, ఎంపీ అర్వింద్ మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరుతోంది. కోరుట్ల నుంచి బీజేపీ తరపున పోటీ చేస్తున్న ఎంపీ అర్వింద్‌ను బీఆర్‌ఎస్ కార్యకర్తలు కచ్చితంగా ఓడించనున్నట్లు కవిత వ్యాఖ్యానించారు. కేటీఆర్, కవిత కారణంగానే బీఆర్‌ఎస్ ఓడనుందని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు. ఆకుల లలితను ప్రత్యర్థి పార్టీలోకి పంపి కోవర్టు ఆపరేషన్ చేసేందుకు కవిత స్కెచ్ వేశారని ఆరోపించారు.





ఎమ్మెల్సీ కవిత



ఎంపీ అర్వింద్


సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: శాసనసభ ఎన్నికల ప్రచారం స్పీడందుకుంటున్న కొద్దీ నేతల మధ్య మాటల యుద్ధం మరింత ముదురుతోంది. నువ్వా నేనా అనే విధంగా నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్సీ కవిత మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. గత పార్లమెంట్ ఎన్నికల్లో కవితపై అర్వింద్ విజయం సాధించినప్పటి నుంచీ ఈ పోరు నడుస్తూనే వస్తోంది. పసుపు బోర్డు అంశంపై అర్వింద్, కవితతోపాటు ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు సైతం పోటాపోటీ మాటలతో పాటు ఫ్లెక్సీల వార్‌కు దిగారు. మీరొక ఫ్లెక్సీ పెడితే మేము పది ఫ్లెక్సీలు పెడతాం అన్న రీతిలో ఈ వార్ నడిచింది. మాటల యుద్ధం మాత్రం ఎప్పటికప్పుడు కొనసాగుతూనే వచ్చింది. ఇదిలా ఉండగా తాజాగా ఎన్నికల నేపథ్యంలో ఈ మాటల యుద్ధం తారాస్థాయికి చేరుతోంది. ఇది రానురాను మరింత పెరుగుతోంది. కోరుట్ల నుంచి బీజేపీ తరుపున పోటీ చేస్తున్న ఎంపీ అర్వింద్‌ను బీఆర్‌ఎస్ కార్యకర్తలు కచ్చితంగా ఓడించనున్నట్లు కవిత తాజాగా వ్యాఖ్యానించారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని అన్ని సెగ్మెంట్లలో తిరిగి బీజేపీ, కాంగ్రెస్‌లను ఓడిస్తామన్నారు. మరోవైపు అర్వింద్ మాత్రం బీఆర్‌ఎస్‌పై మాటల దాడిని తీవ్రతరం చేశారు. కవిత ప్రచారం చేస్తే బీజేపీకి మరింత మెజారిటీ వస్తుందని అర్వింద్ అన్నారు. బీఆర్‌ఎస్‌కు కార్యకర్తలే ఓట్లు వేయరన్నారు. ఆకుల లలితను ప్రత్యర్థి పార్టీలోకి పంపి కోవర్టు ఆపరేషన్ చేసేందుకు కవిత స్కెచ్ వేశారన్నారు. కేటీఆర్, కవిత కారణంగానే బీఆర్‌ఎస్ ఓడనుందన్నారు. అభద్రతా భావంతో ఉన్న బీఆర్‌ఎస్ హిందువులను కులాల వారీగా విభజిస్తోందన్నారు. ఎక్కడా గెలవలేని కవిత ఎమ్మెల్సీ పదవి తీసుకున్నారన్నారు. అలాంటి కవిత వేరే వాళ్లను ఎలా గెలిపిస్తుందని అర్వింద్ అన్నారు.

పైడి అంటే ఫ్లవర్ కాదు.. ఫైర్

ఆర్మూర్ నియోజకవర్గంలో త్రిముఖ పోరు నెలకొంది. సిట్టింగ్ అభ్యర్థి జీవన్‌రెడ్డి ఇప్పటికే ఒక విడత ప్రచారం పూర్తి చేశారు. కులసంఘాల వారీగా ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. అయితే బీజేపీ అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డి మాత్రం జీవన్‌రెడ్డిపై మాటల దాడి చేస్తున్నారు. పైడి అంటే ఫ్లవర్ కాదు.. ఫైర్ అని చెబుతున్నారు. జీవన్‌రెడ్డి సర్పంచ్‌లను బెదిరించినట్లు నన్ను బెదిరించాలంటే సాధ్యం కాదన్నారు. తాను గెలిస్తే జీవన్ మాల్ లీజ్‌ను రద్దు చేస్తానని చెబుతున్నారు. ఫాంహౌజ్, పైరవీల ధ్యాస జీవన్‌రెడ్డిదన్నారు. ఆర్మూర్ అంబేద్కర్ సెంటర్‌లో లైవ్ చర్చకు రావాలని రాకేశ్‌రెడ్డి సవాల్ విసిరారు. ఆస్తుల చిట్టా బహిర్గతం చేసుకుందామన్నారు. ఎవరేమిటో తేల్చుకుందామన్నారు. నిజామాబాద్ అర్బన్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి గణేష్‌గుప్తా, బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ సైతం మెల్లగా మాటల దాడి పెంచుతున్నారు.

నేడు ఎన్డీఎస్ఎల్ అధికారుల రాక

- తమకు సమాచారమిచ్చారన్న కార్మికులు
- ఎన్నికల వేళ చర్చనీయాంశమైన అధికారుల పర్యటన



బోధన్: నిజాంషుగర్స్‌ను ప్రైవేట్ యాజమాన్యం లేఆఫ్ ప్రకటించి మూసివేసిన నాటి నుంచి కార్మికులు తమకు న్యాయం చేయాలని పోరాడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రైవేట్‌యాజమాన్యం ముఖ్య అధికారులైన సీఈవో సుబ్బరాజు, పర్సనల్ ఆఫీసర్ శ్రీధర్‌రాజు శుక్రవారం ఉదయం 11గంటలకు ఫ్యాక్టరీకి రానున్నట్లు సమాచారం. అధికారులు తమకు సమాచారం అందించారని కార్మికులు అంటున్నారు. లేఆఫ్ ఎత్తివేయాలని, బకాయి వేతనాలను చెల్లించడంతోపాటు ఉద్యోగభద్రత కల్పించాలని కార్మికులు ఫ్యాక్టరీ ఎదుట రిలే దీక్షలు చేస్తున్నారు. నిజాంషుగర్స్ రాజకీయ పార్టీలకు ప్రచారాస్త్రంగా మారడంతో పరస్పర విమర్శలు, ఆరోపణలు చేసుకుంటున్నారు. ఎన్నికల వాతావరణం వేడెక్కిన ఈ తరుణంలో అధికారుల రాక సర్వత్రా చర్చనీయాంశమైంది. అధికారులు కార్మికులతో సమావేశమై సమస్యలపై చర్చిస్తారా? లేక సాధారణ సందర్శనగా వచ్చి వెళ్తారా? అనే విషయంలో స్పష్టత కరువైంది. ఫ్యాక్టరీ భవిష్యత్తు అంశం ఢిల్లీ ఎన్‌ఎల్‌ఏటీ (నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్)లో ఉంది. చాలామంది కార్మికులు ఆర్థిక, మానసిక శోభ, ఆరోగ్య సమస్యలతో తనువు చాలించారు. బతుకుదెరువు కోసం ఎంతో మంది పోరాడుతున్నారు. కార్మిక కుటుంబాల్లో కన్నీటి రోదనలు మిగిలాయి. 2014 ఎన్నికల వేళ స్వయంగా కేసీఆర్ ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను రద్దు చేసి అధికారంలోకి రాగానే వంద రోజుల్లో స్వాధీనం చేసుకుని పూర్వవైభవం తీసుకొస్తామని ఇచ్చిన హామీ నేటికీ నెరవేరకపోగా ,నడిచే ఫ్యాక్టరీ మూతపడింది.

బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుంది

- బీఆర్‌ఎస్‌ను ఆ పార్టీ కార్యకర్తలే ఓడిస్తారు..
- నవంబర్ 30 తర్వాత కాంగ్రెస్ అభ్యర్థులు గాయబ్ అవుతారు
- కవిత కోరుట్లలో ప్రచారం చేయాలని కోరుకుంటున్నా : ఎంపీ అర్వింద్ ధర్మపురి

సుభాష్‌నగర్: రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం చిట్‌చాట్, మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఎంపీ సమాధానాలిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీస్థానాల్లో బీజేపీ విజయం సాధించనుందని, జగిత్యాల్, బోధన్‌లో కాంగ్రెస్ మూడో స్థానానికి పరిమితం కానుందన్నారు. బీఆర్‌ఎస్‌కు కేవలం 20 నుంచి 25 స్థానాలు మాత్రమే వస్తాయని, మళ్లీ అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదని, ప్రజల్లో బీఆర్‌ఎస్‌పై విపరీతమైన వ్యతిరేకత ఉందని పేర్కొన్నారు. హిందువులను కులాలవారీగా విభజించుకుంటూ గెలుపు కోసం ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో బీఆర్‌ఎస్, కేసీఆర్ కుటుంబాన్ని తిరస్కరించే పరిస్థితి ఏర్పడిందని, అందుకు నంబర్‌వన్ కవిత, నంబర్ టు కేటీఆర్ కారణమని, కేసీఆర్ సైతం గజ్వేల్‌లో ఓడిపోతారన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థులు నవంబర్ 30 నుంచి డిసెంబర్ 3వతేదీలోగా సగం కంటే ఎక్కువ మంది గాయాబ్ అవుతారని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి మంచి మాటకారి అని, పగటి కలలు కంటున్నారని, రాజగోపాల్ రెడ్డి నిలకడ లేని వ్యక్తి అని విమర్శించారు. లిక్కర్ కేసులో కవితపై విచారణ కొనసాగుతున్నదని తెలిపిన అర్వింద్.. ఓటుకు నోటు కేసులో సీబీడీ ఏం చేస్తోందని, బీఆర్‌ఎస్ రేవంత్‌రెడ్డిని ఎందుకు కాపాడుతున్నదని ప్రశ్నించారు. కోరుట్లలో 20శాతానికిపైగా ఓట్లతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. కవిత వచ్చి ప్రచారం చేస్తే మెజార్టీ పెరుగుతుందని, అందుకే ఆమె అక్కడికి రావాలని తాను కోరుకుంటున్నానన్నారు. బీఆర్‌ఎస్‌ను ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలే ఓడించే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. రూరల్‌లో గెలిచే అభ్యర్థి వస్తాడని ఎంపీ పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, నిజామాబాద్ అర్బన్ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గసభ్యులు దినేష్ కులాచారి, మల్లికార్జున్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, స్రవంతిరెడ్డి, మాస్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాట్రిక్ సాధిస్తాం

- వందకుపైగా సీట్లు మావే
- ఉమ్మడి జిల్లాలో 9 సీట్లు గెలవబోతున్నాం
- ఆత్మవిశ్వాసంతో చెబుతున్నా : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నిజామాబాద్‌నాగారం: హ్యాట్రిక్ సాధించడంతోపాటు వందకుపైగా స్థానాల్లో విజయం సాధిస్తామని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 9సీట్లు గెలుస్తామన్నారు. జిల్లా కేంద్రంలో కవిత గురువారం మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గల్ఫ్, బీడీ కార్మికులతో సహా అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్‌లాగా అబద్ధాలు చెప్పడం, బీజేపీలాగా పథకాలను కాపీ కొట్టడం తమకు రాదన్నారు. నిజాలు చెబుతూ ప్రచారం చేయడం బీఆర్‌ఎస్ లక్షణమని, కాబట్టే మరోసారి అధికారంలోకి వస్తామనే సంపూర్ణ విశ్వాసం తమకు ఉందన్నారు. రైతుబంధు ఆపాలని, మూడు గంటలే కరెంటు ఇవ్వాలని కాంగ్రెస్ రైతులకు దూరమైందన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను తాము కాపీ కొట్టామని ఆ పార్టీ నాయకులు అంటుంటే ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. ప్రచారంలో తమ పార్టీ చాలా ముందుందని, పార్టీ ఎజెండా, మేనిఫెస్టో, సీఎం అభ్యర్థి వంటి విషయాల్లో తమకు స్పష్టత ఉన్నదని, ఇతర పార్టీల్లో ఆ స్పష్టత లేకపోవడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు.

గత పదేళ్లలో తెలంగాణ వేగంగా ఎదగడానికి కారణం రాజకీయ సుస్థిరత అని, రాష్ట్రాన్ని బీఆర్‌ఎస్ రాజకీయంగా సుస్థిరంగా ఉంచిందని స్పష్టం చేశారు. నిజామాబాద్ జిల్లాతోపాటు అనేక జిల్లాల్లో ఐటీ హబ్‌లు ఏర్పడుతాయని ఎవరూ అనుకోలేదని, కానీ జిల్లాల్లో సీఎం కేసీఆర్ ఐటీ హబ్‌లు ఏర్పాటు చేసి చూపించారని పేర్కొన్నారు. భవిష్యత్‌లో పారిశ్రామిక హబ్‌లు కూడా వస్తాయని, ఇందులో భాగంగా నిజామాబాద్‌లో పారిశ్రామికవాడలకు అవసరమైన భూములను సిద్ధం చేసుకున్నామని కవిత తెలిపారు. తదుపరి దశ అభివృద్ధిలో పారిశ్రామికాభివృద్ధి ఉంటుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి షబ్బీర్ అలీ కామారెడ్డి నుంచి పారిపోయి నిజామాబాద్‌కు వస్తున్నారని, ఆయన ముఖం చూసి కాకుండా పార్టీలను చూడాలని విజ్ఞప్తి చేశారు. మైనారిటీలను కాంగ్రెస్ కేవలం ఓటు బ్యాంకు గానే చూసిందని, వారి అభివృద్ధికి ఏమీ చేయలేదని విమర్శించారు. ఓట్లు చీలితే ఎవరికీ లాభమో ముస్లిములు ఆలోచించాలని, ఓట్లను చీల్చకుండా కేసీఆర్ వైపు నిలబడితే ముస్లిం సమాజానికి మేలు జరుగుతుందన్నారు. ఏ ప్రభుత్వం వస్తే మతసామరస్యం వెల్లువిరుస్తుందో మీ అందరికీ తెలుసని, అది బీఆర్‌ఎస్ ప్రభుత్వంతో మాత్రమే సాధ్యమవుతుందని కవిత పేర్కొన్నారు.

పోలీసుల క్యాండిల్ ర్యాలీ



ఖలీల్‌వాడి: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా (పోలీసు ఫ్లాగ్ డే) పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ శింగెనవార్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో గురువారం రాత్రి క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. అదనపు డీసీపీ గిరిరాజు ఆధ్వర్యంలో పాత కలెక్టరేట్ గ్రౌండ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ ఎల్‌ఐసీ చౌరస్తా, మున్సిపల్ ఆఫీసు, ఎన్టీఆర్ చౌరస్తా మీదుగా పోలీస్ హెడ్‌క్వార్టర్స్ వరకు కొనసాగింది. ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐలు, ఎస్సైలు, అమరవీరుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

రూ.1.06 కోట్ల నగదు రిలీజ్

సుభాష్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. ఇప్పటివరకు 49 మంది నుంచి రూ. 2,09,45,573 నగదును పట్టుకోగా, అందులో రూ.1,06,78,838 రిలీజ్ చేశారు. ఆదాయ పన్ను శాఖకు రూ.97,22,935 రిఫర్ చేయగా, రూ.5,43,800 నగదుకు సంబంధించి అదనపు కలెక్టర్ వద్ద కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

నియోజకవర్గం	సంఖ్య	రిలీజైన నగదు (రూ.లు)
ఆర్మూర్	4	18,38,769
బోధన్	6	22,51,209
బాన్సువాడ	15	18,85,400
నిజామాబాద్ అర్బన్	11	25,91,870
నిజామాబాద్ రూరల్	2	6,87,920
బాల్కొండ	6	14,23,670
పరిష్కారమైనవి	44	1,06,78,838
ఐటీశాఖకు రిఫర్	3	97,22,935
పెండింగ్	2	5,43,800
మొత్తం	49	2,09,45,573

అవినీతి, అక్రమాలకు అడ్డా.. బాల్కొండ!

- అధికార పార్టీ నిర్వాకమే..
- అన్నపూర్ణమ్మ విమర్శ

మోర్తాడ్(బాల్కొండ) : బాల్కొండ నియోజకవర్గంలో అధికార బీఆర్‌ఎస్ అవినీతి, అక్రమాలకు హద్దులు లేకుండాపోయాయని బీజేపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే ఏలేటి అన్నపూర్ణమ్మ విమర్శించారు. అభివృద్ధి పేరుతో దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఏర్గట్ల మండలం గుమ్మిర్యాల్, నాగేంద్రనగర్, దొంచందాలో గురువారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డి అక్రమాలకు పాల్పడ్డారని, కమీషన్లు తప్ప అసలైన పనులు ఎక్కడ కూడా చేయలేదని ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు తోకల నర్సయ్య, అసెంబ్లీ కన్వీనర్ మల్కన్నగారి మోహన్, మండల అధ్యక్షుడు ఏలేటి నారాయణరెడ్డి, గుమ్మిర్యాల్ సర్పంచ్ రాజారెడ్డి, ఎంపీటీసీ బొల్లి శంకర్ పాల్గొన్నారు.



గుమ్మిర్యాల్‌లో అన్నపూర్ణమ్మను సన్మానిస్తున్న మహిళలు

విధులను నిష్పక్షపాతంగా నిర్వర్తించాలి

- ఎన్నికల వ్యయం, ప్రచార సరళిని నిశితంగా పరిశీలించాలి
- నిఘా బృందాలకు కలెక్టర్, సీపీ దిశానిర్దేశం



మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో సీపీ, అదనపు కలెక్టర్

సుభాష్‌నగర్: ఎన్నికల విధులను పారదర్శకంగా, నిష్పక్ష పాతంగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సూచించారు. స్టాటిస్టిక్ సర్వైలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ తదితర నిఘా బృందాల అధికారులకు గురువారం కలెక్టరేట్‌లో ని సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ప్రచార సరళి పరిశీలన, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే చర్యలను నిరోధించడం, ఫిర్యాదులపై తక్షణమే స్పందించడం, నిరంతర తనిఖీల నిర్వహణ తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఐదు రాష్ట్రాల్లో శాసనసభ ఎన్నికలు జరుగుతుండగా, ఎన్నికల వ్యయం విషయంలో ఎలక్షన్ కమిషన్ తెలంగాణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తోందన్నారు. దీన్ని దృష్టిలోపెట్టుకుని నిఘాబృందాలు సమర్థవంతంగా, నిబద్ధతతో విధులను నిర్వర్తించాలన్నారు. 'కోడ్' ఉల్లంఘన ఫిర్యాదులపై వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నిఘా బృందాల దృష్టిని మళ్లించేందుకు వచ్చే తప్పుడు ఫిర్యాదుల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. స్టాటిస్టిక్ సర్వైలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ తదితర బృందాలకు సమకూర్చిన వాహనాలకు అత్యాధునిక సాంకేతికతతో కూడిన పీటీజీ కెమెరా లను ఏర్పాటు చేయిస్తున్నామని, వాటి ద్వారా నిఘా బృందాల పనితీరు కలెక్టరేట్‌లో ఏర్పాటు చే సిన కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షిస్తామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 22 చెక్ పోస్టుల వద్ద సైతం పీటీజీ కెమెరాలను ఏర్పాటుచేశామన్నారు. సీపీ కల్మేశ్వర్ మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికల నిర్వహణకు ప్రతిఒక్కరూ అంకితభావంతో కృషి చేయాలని, ఎన్నికల నియమావళి తప్పకుండా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నిక ల వ్యయం, ప్రచార సరళి, ప్రలోభాల విషయంలో నిఘా బృందాలు క్రియాశీల పాత్ర పోషించాలని సూచించారు. శిక్షణ తరగతుల్లో అదనపు కలెక్టర్ పి యాదిరెడ్డి, ఎన్నికల వ్యయం నోడల్ అధికారి పాప య్య, ట్రెజరీ శాఖ ఉప సంచాలకులు కె దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

పోలింగ్ సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను గురువారం పూర్తిచేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు నేతృత్వంలో కలెక్టరేట్‌లోని ఎన్‌ఐసీ హాల్‌లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. వారికి ఈనెల 30, 31వ తేదీల్లో ఎంపిక చేసిన కేంద్రాల్లో మాస్టర్ ట్రైనర్స్ ద్వారా శిక్షణ ఇప్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో అదనపు కలెక్టర్ పి యాదిరెడ్డి, సీపీఓ బాబూరావు, ఎన్‌ఐసీ అధికారి రవికుమార్, ఏఓ ప్రశాంత్, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను అదనపు కలెక్టర్ పి యాదిరెడ్డి సందర్శించారు. అక్కడి సదుపాయాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.

క్లుప్తంగా

రేపు రాత్రి పాక్షిక చంద్రగ్రహణం

నిజామాబాద్ సిటీ: చంద్రగ్రహణం శనివారం రాత్రి 1.06 గంటలకు సంభవిస్తున్నట్లు బ్రహ్మశ్రీ జోషి మధుసూదన శర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రగ్రహణం సందర్భంగా మధ్యాహ్నం, రాత్రి వేళల్లో ఆలయాలు మూసి ఉంటాయని పేర్కొన్నారు. అశ్వనీ నక్షత్రం, మేషరాశి, తులారాశి, మీనారాశి వారు ఈ గ్రహం చూడరాదన్నారు. సాయంత్రం 4 గంటల లోపు భోజనం ముగించాలన్నారు. గ్రహణ అనంతరం స్నానాలు చేయాలని, ఇంట్లో నిల్వ ఉంచే పదార్థాలపై గరక(గడ్డి) ఉంచాలన్నారు. మరింత సమాచారం కోసం 9396432211 నంబరును సంప్రదించాలని కోరారు.

ఎకనామిక్స్‌లో ఇద్దరికి డాక్టరేట్


టి దీప్తి


జి మహేశ్

తెయూ(డిచ్‌పల్లి): తెయూ అర్థశాస్త్ర విభాగం (ఎకనామిక్స్)లో పరిశోధక విద్యార్థులు టి దీప్తి, జి మహేశ్ డాక్టరేట్ సాధించారు. హిమాచల్‌ప్రదేశ్ సెంట్రల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ బి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో 'మహిళాపారిశ్రామికవేత్తలపై ఆర్థిక, సామాజిక ప్రభావాలు' అనే అంశంపై, నిజామాబాద్ జిల్లాలోని సూక్ష్మతరహా పరిశ్రమల పనితీరు' అనే అంశంపై పరిశోధనలు చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్, ఎకనామిక్స్ హెచ్‌వోడీ ఎ.పున్నయ్య, బీవోఎస్ చైర్మన్ టి.సంపత్, అధ్యాపకులు పాతనాగరాజు, కె.రవీందర్‌రెడ్డి, స్వప్న, రాంబాబు, స్రవంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల రాముని విగ్రహానికి ఎంపీ ఘన స్వాగతం



ఆర్మూర్‌టౌన్: ఉత్తరప్రదేశ్‌లో ప్రతిష్ఠాపనకు వెళ్తున్న బలరామ, బాల రాముడి విగ్రహాలకు ఆర్మూర్ పట్టణంలో ఎంపీ అర్వింద్ ఘన స్వాగతం పలికారు. దీపావళి రోజున ఉత్తరప్రదేశ్‌లో సీఎం యోగి ఆదిత్యనాథ్ విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. నంద్యాల నుంచి విగ్రహాలతో వెళ్తున్న రథానికి ఎంపీ ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీ వెంట నాయకులు పైడి రాకేశ్ రెడ్డి, పుప్పాల శివరాజ్, జీవీ నర్సింహారెడ్డి, జెస్సు అనిల్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు నంబర్ కేటాయింపు


నిజామాబాద్‌అర్బన్: ప్రతి విద్యార్థికి ఒక గుర్తింపు నంబర్‌ను కేటాయిస్తూ వారు చదువు పూర్తయ్యే వరకు దానిని వినియోగంలో ఉంచేందుకు కేంద్ర విద్యాశాఖ నూతన మార్గదర్శకాలను జారీ చేసింది. ఆటోమెటెడ్ పర్మినెట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్టరీ అనే నూతన విధానాన్ని తీసుకొచ్చింది. జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు ఈ గుర్తింపు నంబర్ ఉంటుంది. ప్రైవేట్, ప్రభుత్వ, ఎయిడెడ్, గురుకులాలు, అన్ని పాఠశాలలకు ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. దీనికి సంబంధించి విద్యార్థుల, తల్లిదండ్రుల ఆధార్‌కార్డులను అన్ని పాఠశాలల యజమాన్యాలు సేకరించి జిల్లా విద్యాశాఖకు అందజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నాడు కాంగ్రెస్.. నేడు బీఆర్‌ఎస్

- 15వ సారి అసెంబ్లీ ఎన్నిక
- 1978 నుంచి ఎస్సీ రిజర్వుడు
- స్వతంత్ర అభ్యర్థులు మూడు సార్లు, కాంగ్రెస్ ఐదు, టీడీపీ నాలుగు, బీఆర్‌ఎస్ రెండు సార్లు ప్రాతినిధ్యం
- ఈ ఎన్నికల్లో గెలిచేదవరో?



జంగ్ తెలంగాణ


హన్మంత్ సింధే


సొదాగర్ గంగారాం


అరుణతార


బేగరి పండరి


విఠల్‌రెడ్డి

నిజాంసాగర్: కాంగ్రెస్, టీడీపీలకు కంచుకోటగా ఉన్న జుక్కల్ నియోజకవర్గం ప్రత్యేక రాష్ట్ర సాధనతో బీఆర్‌ఎస్ పాగా వేసింది. ఏడు దశాబ్దాల చరిత్ర కలిగిన జుక్కల్ నియోజకవర్గానికి 1952 నుంచి 2018 వరకు 14 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాలకు సరిహద్దు కూడలిగా ఉన్న జుక్కల్ నియోజకవర్గం మూడు రాష్ట్రాల సంప్రదాయం కలిగి ఉంటుంది. కన్నడ, మరాఠి, తెలుగు భాష సంప్రదాయాలతో ఈ ప్రాంత ప్రజల ప్రత్యేకత వేరు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఐదు సార్లు, టీడీపీ నాలుగు సార్లు, స్వతంత్రులు మూడు సార్లు, బీఆర్‌ఎస్ రెండు సార్లు విజయం సాధించాయి.

కొనసాగుతున్న కారు హవా

2014, 2018లో నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో కారు హవా కొనసాగుతూ వస్తోంది. 1957లో స్వతంత్ర అభ్యర్థిగా మాధవ్‌రావు, 1962లో కాంగ్రెస్ నుంచి నాగ్‌నాథ్‌పటేల్, 1967లో స్వతంత్ర అభ్యర్థిగా వి. విఠల్‌రెడ్డి, 1972లో స్వతంత్ర అభ్యర్థిగా సామెల్ విఠల్‌రెడ్డి, 1978లో కాంగ్రెస్ నుంచి సొదాగర్ గంగారాం, 1983లో కాంగ్రెస్ నుంచి సొదాగర్ గంగారాం, 1985లో టీడీపీ నుంచి బేగరి పండరి, 1989లో కాంగ్రెస్ నుంచి సొదాగర్ గంగారాం, 1994లో టీడీపీ నుంచి బేగరి పండరి, 1999లో టీడీపీ నుంచి అరుణతార, 2004లో కాంగ్రెస్ నుంచి సొదాగర్ గంగారాం, 2009లో టీడీపీ నుంచి హన్మంత్‌సింధే, 2014, 2018లో బీఆర్‌ఎస్ నుంచి హన్మంత్‌సింధే ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. కాగా కాంగ్రెస్ నుంచి సొదాగర్ గంగారాం నాలుగు సార్లు, టీడీపీ నుంచి ఒకసారి, బీఆర్‌ఎస్ నుంచి రెండు సార్లు హన్మంత్‌సింధే మూడు సార్లు వరుసగా విజయం సాధించారు. నియోజకవర్గం నుంచి వరుసగా మూడు సార్లు హన్మంత్‌సింధే విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టారు.

1978 నుంచి ఎస్సీ రిజర్వుగా..

సమైక్య రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతంగా పిలిచే జుక్కల్ నియోజకవర్గం 1957 నుంచి 1972 వరకు అసెంబ్లీ ఎన్నికల్లో జనరల్‌గా ఉంది. 1978లో జుక్కల్ నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడు స్థానంగా మారింది. ఎస్సీ రిజర్వు స్థానం ఏర్పడడంతో కాంగ్రెస్, టీడీపీలు ఎన్నికల్లో నువ్వా, నేనా అన్నట్లు పోటీ పడ్డాయి. తెలంగాణ రాష్ట్రం వచ్చాక కాంగ్రెస్, టీడీపీలకు ఓటర్లు చరమగీతం పలికి కారు గుర్తుకు విజయబావుటను ఎగుర వేశారు. ఎస్సీ రిజర్వు అయినప్పటి నుంచి కాంగ్రెస్ నుంచి సొదాగర్ గంగారాం నాలుగు సార్లు, ఒక సారి బేగరి పండరి, మరో సారి అరుణతార, మూడు సార్లు హన్మంత్ సింధే ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. నాలుగు దశాబ్దాల కాలం నుంచి నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడు స్థానంగా ఉండటం గమనార్హం.

మంత్రి పదవి దక్కని నియోజకవర్గం

సమైక్య రాష్ట్రంలో 12 సార్లు, తెలంగాణ రాష్ట్రంలో 2 సార్లు నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన ఎమ్మెల్యేలకు ఇప్పటి వరకు మంత్రి పదవి దక్కలేదు. ఏడు దశాబ్దాల నుంచి మంత్రి పదవి నియోజకవర్గానికి దక్కకపోవడం గమనార్హం.

జుక్కల్ నుంచి ప్రాతినిధ్యం వహించిన వారు..

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ
1957	మాధవ్‌రావు	స్వతంత్ర
1962	నాగ్‌నాథ్‌పటేల్	కాంగ్రెస్
1967	వి. విఠల్‌రెడ్డి	స్వతంత్ర
1972	సామెల్ విఠల్‌రెడ్డి	స్వతంత్ర
1978	సొదాగర్ గంగారాం	కాంగ్రెస్
1983	సొదాగర్ గంగారాం	కాంగ్రెస్
1985	బేగరి పండరి	టీడీపీ
1989	సొదాగర్ గంగారాం	కాంగ్రెస్
1994	బేగరి పండరి	టీడీపీ
1999	అరుణతార	టీడీపీ
2004	సొదాగర్ గంగారాం	కాంగ్రెస్
2009	హన్మంత్‌సింధే	టీడీపీ
2014	హన్మంత్‌సింధే	బీఆర్‌ఎస్
2018	హన్మంత్‌సింధే	బీఆర్‌ఎస్

నియోజకవర్గం ఓటర్ల సంఖ్య

పురుషులు:	97,618
మహిళలు:	1,00,269
ఇతరులు:	10
మొత్తం:	1,97,897

వర్సిటీ అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి


మాట్లాడుతున్న రిజిస్ట్రార్ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ అభివృద్ధిలో బోధన, బోధనేతర సిబ్బంది ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని రిజిస్ట్రార్ యాదగిరి సూచించారు. తెయూ క్యాంపస్‌లో గురువారం నిర్వహించిన న్యాక్ సన్నాహక సమావేశంలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బందికి రిజిస్ట్రార్ దిశానిర్దేశం చేశారు. ఉన్నత విద్యాసంస్థలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆర్థికపరమైన మద్దతుకు న్యాక్ అక్రిడియేషన్ తప్పనిసరి అయిందన్నారు. న్యాక్ గుర్తింపుతోనే వర్సిటీలకు భవన నిర్మాణ గ్రాంట్లతో పాటు మౌలిక వసతుల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తారని తెలిపారు. ప్రధానంగా ఏక్యూఏఆర్ 2022–23 రూపకల్పనపై అధ్యాపకులకు సమగ్రంగా అవగాహన కల్పించారు. సమావేశంలో ప్రొఫెసర్ సీహెచ్ ఆరతి, ఐక్యూఏసీ డైరెక్టర్ ప్రవీణ్ మామిడాల, ప్రొఫెసర్లు నసీమా, ఘంటా చంద్రశేఖర్, రాంబాబు, అపర్ణ, త్రివేణి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఎలుగుబంటిని చూసి..


అటవీ ప్రాంతంలో చిక్కుకున్న ముగ్గురు యువకులు

వర్ని: బడాపహాడ్ అటవీ ప్రాంతంలో నమాజ్ పహాడ్ వద్దకు వెళ్లిన యువకులు ఎలుగుబంటిని చూసి అడవిలో చిక్కుకున్న ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. బుధవారం సాయంత్రం బడాపహాడ్ అటవీ ప్రాంతంలోని నమాజ్ పహాడ్ వద్దకు మేడ్చల్‌కు చెందిన ఆజం ఖాన్, దస్తగిరి మరో యువకుడు దర్శనార్థమై వెళ్లగా మార్గమధ్యలో ఎలుగుబంటి తారసపడగా భయంతో ముగ్గురు చెట్టుపైకి ఎక్కి సెల్‌ఫోన్ సహాయంతో బంధువులకు సమాచారం అందించారు. బుధవారం రాత్రి బంధువులు పోలీసులకు, వక్ఫ్ బోర్డ్ అధికారులకు సమాచారం అందించి అటవీ ప్రాంతంలో గాలించారు. రాత్రి రెండు గంటల ప్రాంతంలో వెతికి పట్టుకున్నారు. గురువారం స్థానికులు, వక్ఫ్ బోర్డు అధికారుల సహాయంతో బడాపహాడ్‌కు చేరుకున్నారు. ఎలుగుబంటిని చూసి భయంతో అల్లాడిపోయినట్లు బాధితులు పేర్కొన్నారు. ఘటనలో ఎవరికీ ఎలాంటి నష్టం జరగలేదు. బడాపహాడ్ అటవీ ప్రాంతంలో వన్య ప్రాణాలు ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని ఫారెస్ట్, పోలీసు అధికారులు భక్తులకు సూచించారు.

మోపాల్ పీఈటీ సస్పెన్షన్

నిజామాబాద్‌అర్బన్: మోపాల్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన పీఈటీని డీఈవో దుర్గాప్రసాద్ గురువారం సస్పెన్షన్ చేశారు. ప్రవర్తన సరిగా లేదని గ్రామస్తులు ఇటీవల డీఈవోకు ఫిర్యాదు చేయడంతో సస్పెన్షన్ వేసినట్లు డీఈవో పేర్కొన్నారు.

'నవోదయ'కు దరఖాస్తులు

నిజాంసాగర్(జుక్కల్) : నిజాంసాగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో తొమ్మిదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సత్యవతి ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో ఎనిమిదో తరగతి, పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గంజాయి విక్రేత అరెస్ట్

కామారెడ్డి క్రైం: కామారెడ్డి రైల్వే స్టేషన్ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని గురువారం పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్‌లోని డ్రైవర్స్ కాలనీకి చెందిన జావేద్ ఖాన్ అనే వ్యక్తిని కామారెడ్డి పోలీసులు విశ్వసనీయ సమాచారం మేరకు కామారెడ్డిలో పట్టుకుని విచారించారు. అతని వద్ద విక్రయించేందుకు తెచ్చిన 400 గ్రాముల గంజాయి లభించగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో నరేశ్ తెలిపారు.

రైలు ఢీకొని 20 గొర్రెలు మృతి

నవీపేట: మండలంలోని మిట్టాపూర్ రైల్వే గేటు సమీపంలో గురువారం సాయంత్రం గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో 20 గొర్రెలు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. బాసర రహదారి పక్కన గుట్టపైకి మేత కోసం వెళ్లిన గొర్రెలు తిరుగు ప్రయాణంలో పట్టాలను దాటుతుండగా ఈ ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. మృతి చెందిన 20 గొర్రెల విలువ సుమారుగా రూ.లక్ష వరకు ఉంటుందన్నారు. ఈ విషయమై రైల్వే పోలీసులను వివరణ కోరగా తమకెలాంటి ఫిర్యాదు రాలేదని అన్నారు.

ఈవీఎం గోడౌన్ పరిశీలన


గోడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

సుభాష్‌నగర్: జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో గల ఉన్న ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం పరిశీలించారు. ఎన్నికల నిర్వహణ కోసం శాసనసభ నియోజకవర్గ కేంద్రాలకు ర్యాండమైజేషన్ ద్వారా బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లను ఇటీవలే తరలించారు. తరలింపు పూర్తయిన తర్వాత ఇంకా గోడౌన్‌లో మిగిలి ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించి, నిబంధనలను అనుసరిస్తూ వాటిని భద్రపరిచేలా పర్యవేక్షణ చేశారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి


కవాతు నిర్వహిస్తున్న బీఎస్‌ఎఫ్ సిబ్బంది

ఆర్మూర్‌టౌన్: రానున్న ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును ధైర్యంగా వినియోగించుకోవాలని సీపీ కల్మేశ్వర్ అన్నారు. ఓటర్లకు భరోసా కల్పించడానికి ఆర్మూర్ పట్టణంలో గురువారం బీఎస్‌ఎఫ్ సిబ్బందితో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఓటర్లు ఎవరికీ భయపడకుండా ధైర్యంగా ముందుకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అనంతరం పెర్కిట్ చౌరస్తా నుంచి ఆర్మూర్ పట్టణం వరకు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఏసీపీ జగదీశ్‌చందర్, ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సురేశ్‌బాబు, భీంగల్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

తనిఖీల్లో నగదు పట్టివేత


తాండూర్‌లో స్వాధీనం చేసుకున్న నగదుతో అధికారులు

నాగిరెడ్డిపేట/ బిచ్కుంద/ నస్రుల్లాబాద్: నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్ గేట్ వద్ద వాహనాల తనిఖీలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ టీం అధికారులు కారులో ఒకరు ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ. లక్షా30వేల నగదును గురువారం పట్టుకున్నారు. గుంటూర్ ప్రాంతానికి చెందిన మొగిలీశ్వర్‌రావు తన కారులో నగదును తీసుకుని వెళ్తున్నట్లు తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేక పోవడంతో డబ్బును సీజ్ చేసినట్లు చెప్పారు. దీంతో పాటు జప్తిజాన్కంపల్లి గేట్ వద్ద అధికారులు చేపట్టిన వాహనాల తనిఖీలో నిజామాబాద్ జిల్లా సారంగపూర్‌కు చెందిన ఇలియాస్ తన కారులో తీసుకువెళ్తున్న రూ. 50 వేల నగదును పట్టుకుని సీజ్ చేశారు. తనిఖీలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వినోద్, రంగారావు ఉన్నారు.


బిచ్కుందలో..

బిచ్కుంద మండల కేంద్రంలోని అయ్యప్ప గుడి వద్ద వాహనాల తనిఖీలో భాగంగా దెగ్లూర్‌కు చెందిన ఒకరి నుంచి రూ. రూ.95,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మురళి పేర్కొన్నారు. ఈ నగదును కామారెడ్డి ట్రెజరీ కార్యాలయంలో జమచేసినట్లు పేర్కొన్నారు.

నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో వాహనాల తనిఖీల్లో ఎండీ సోఫియాన్ నుంచి రూ. 1,26,550 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై లావణ్య తెలిపారు. ఈ నగదును ఎఫ్‌డీసీకి అప్పగించినట్లు పేర్కొన్నారు. ఆమె వెంట ఏఎస్సై వెంకట్రావు, అబీద్ బేగ్, జమిదార్, సిబ్బంది ఉన్నారు.

మద్యం స్వాధీనం

పెద్దకొడప్‌గల్: అనుమతి లేకుండా మద్యం విక్రయించేందుకు తీసుకెళ్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కోనా రెడ్డి తెలిపారు. మండల కేంద్రం నుంచి విఠల్‌వాడి తండాకు అధిక ధరకు విక్రయించేందుకు మద్యం తీసుకెళ్తున్న ఒకరిని అరెస్టు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ఎస్సై కుటుంబానికి చెక్ పంపిణీ


చెక్కు అందజేస్తున్న సీపీ కల్మేశ్వర్

ఖలీల్‌వాడి: పోలీస్ కంట్రోల్ రూమ్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఎ. దయానంద్‌రావు గుండెపోటుతో మృతి చెందడంతో కుటుంబానికి చెక్కును పంపిణీ చేసినట్లు సీపీ కల్మేశ్వర్ శింగెనవార్ గురువారం తెలిపారు. భద్రత ఎక్స్‌గ్రేషియాలో భాగంగా రూ. 15,93,280 చెక్కును మృతి చెందిన ఎస్సై భార్య మంజులకు సీపీ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో అదనపు డిప్యూటీ పోలీస్ కమిషనర్ గిరిరాజు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు షకీల్ పాషా, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీ బీబీపాటిల్‌కు తప్పిన ప్రమాదం


ప్రమాదానికి గురైన ఎంపీ కారు

నిజాంసాగర్(జుక్కల్): బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నిల ప్రచారానికి వెళ్తున్న జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ రోడ్డు ప్రమాదం నుంచి బయపడ్డారు. గురువారం హైదరాబాద్ నుంచి వస్తూ కామారెడ్డి జిల్లా జుక్కల్ చౌరస్తా మీదుగా డొంగ్లి మండలంలో బీర్‌ఎస్ ఎన్నికల ప్రచారానికి వెళ్తున్నారు. ఎంపీ వాహనానికి అడ్డంగా మోటార్ సైకిల్ రావడంతో డ్రైవర్ సడన్ బ్రేక్ వేశారు. దాంతో ఎంపీ వాహనం పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొట్టడంతో ముందు టైర్ పగిలింది. ఎంపీ బీబీపాటిల్‌తో పాటు గన్‌మెన్లు, పీఏ, డ్రైవర్ రోడ్డు ప్రమాదం నుంచి బయటపడ్డారు.

యువకుడి అదృశ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని రెండోటౌన్ పీఎస్ పరిధికి చెందిన సొదగర్ సురేశ్ అదృశ్యమైనట్లు ఎస్సై అశోక్ గురువారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న సురేష్ ఈ నెల 18న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఈ నెల 22న రాజస్థాన్‌లో ఉన్నానని సమాచారం అందించారని ఇంత వరకు ఇంటికి రాలేదన్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపా రు. సురేశ్ ఆచూకీ వివరాలు ఎవరికైనా తెలిసిఏ పీ ఎస్ నంబర్–8712659838, 08462–220950కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో పలువురి మృతి

వర్ని: మండలంలోని పాత వర్ని గ్రామానికి చెందిన మంచిప్ప సాయికుమార్(22) దుర్గామాత విగ్రహాన్ని నిమజ్జనం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని గాంధీ నగర్‌లో దుర్గామాత విగ్రహాన్ని గ్రామ చెరువులో గురువారం ఉదయం నిమజ్జనం చేస్తుండగా ప్రమాదవశాత్తు సాయికుమార్ నీటిలో పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్కూటీని ఢీకొన్న లారీ ఒకరు..

బాల్కొండ: మెండోరా మండలం చాకిర్యాల్ వద్ద జాతీయ రహదారిపై స్కూటీని వెనుక నుంచి లారీ వేగంగా ఢీకొన్న ఘటనలో మెండోరా మండలం వెల్కటూర్ తండాకు చెందిన బానోత్ అనిల్(25) మృతి చెందినట్లు ఎస్సై శ్రీనివాస్ గురువారం తెలిపారు. అనిల్ స్కూటీపై నిర్మల్ వైపు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొన్నది. ఈ ఘటనలో అనిల్ తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ ఆపకుండ వెళ్లడంతో గంజాల్ టోల్ ప్లాజా వద్ద పోలీసులు పట్టుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

హార్వెస్టర్ కింద పడి ఒకరు..


వెంకటి(ఫైల్)

మోపాల్: మండలంలోని సింగంపల్లిలో హార్వెస్టర్ కింద పడి రైతు సంతాజీవెంకటి(49) మృతిచెందినుట్ల ఎస్సై గంగాధర్ గురువారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటి తాను కౌలు చేస్తున్న పొలంలో మూడు రోజుల క్రితం హార్వెస్టర్‌తో పనులు చేయిస్తుండగా అది వెంకటిపై పడిపోయింది. ఈ ఘటనలో వెంకటి అక్కకడికక్కడే మృతి చెందగా ఈ విషయాన్ని డ్రైవర్ ఎవరికీ చెప్పలేదు. కుటుంబ సభ్యులు కౌలు చేస్తున్న పొలంలో గురువారం పరిశీలించగా బురదలో కూరుకుపోయి మృతి చెందినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి కోడలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి..


రవీందర్ (ఫైల్)

లింగంపేట: మండలంలోని బాణాపూర్‌కు చెందిన ముదాం రవీందర్(32) చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడు కుటుంబ కలహాలతో మనస్థాపానికి గురై వారం రోజుల క్రితం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు మెరుగైన చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు.

8 మంది బైండోవర్

బోధన్‌రూరల్: బోధన్, సాలూర మండలాల్లో పాత నేర చరిత్ర కలిగిన 8 మందిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఏఎస్సై రవీందర్ గురువారం తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గత ఎన్నికల్లో కేసులు కలిగిన, రౌడీ షీటర్లను బైండోవర్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.